

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 10 సెప్టెంబరు, 2013 సంచిక : 4

(విజయ నామ సం॥, శ్రావణ మాసం)

**గౌరవ సంపాదకత్వం**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ**

**ప్రధాన సంపాదకత్వం**

**శ్రీ మాతా శుకవాణి**

భాషా ప్రవీణ, M.O.L.,M.A

**ప్రత్యేక సహకారం**

**శ్రీ వి.వి. కృష్ణారావుగారు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణగారు** M.Tech

**సాయివాణి చందా వివరాలు**

| | | |
|---|---|---|
| విడి ప్రతి .......... | రూ॥ | 6/- |
| వార్షిక చందా .......... | రూ॥ | 60/- |
| ఆజీవన సభ్యత్వం .......... | రూ॥ | 600/- |

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

నల్గొండ జిల్లా - 508 126. ఆం.ప్ర.

**Ph : 9440413455, 9848133565**

Website : www.saidhamam.org

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .......... 2

కోదండ రామ సాయిసన్నిధానం .. 6

స్వరాంజలి .......... 8

లేఖావాణి .......... 9

ఎక్కడని వెదకటం? .......... 11

దీక్ష అంటే .......... 12

అర్థం చేసుకోవటం .......... 14

సాయితో తర్ఖడ్ స్మృతులు-4 .......... 15

షిరిడీ (కపర్దే) డైరీ .......... 20

శ్రీ సాయి సేవ .......... 22

మాతృసంస్థ కబుర్లు .......... 26

శుభాశీరక్షతలు .......... 30

బాలవాణి .......... 32

E-mail : saidhamam.seva@gmail.com, saidhamam.ram@gmail.com







## మా వాణి



సెప్టెంబరు నెలంతా పండగలతో, పర్వదినాలతో నిండిపోయింది. ఋషిపంచమి, వామన జయంతి, కల్కి జయంతి, ఉండ్రాళ్లతద్దె వంటి పర్వదినాలు, వినాయక చవితి పండుగ, ఉపాధ్యాయ దినోత్సవం- ఇలా అడుగడుగునా ఉత్సవాలే. కొన్ని దేశమంతా జరుపుకొనేవీ, ఇంకొన్ని కొన్ని ప్రాంతాల వారు మాత్రమే జరుపుకునేవీ, మరికొన్ని కొన్ని జాతుల వారు మాత్రం జరుపుకొనేవీ-అలాగ. వీటిలో అందరికీ బాగా తెలిసేవి వినాయక చవితీ, ఉపాధ్యాయదినమున్నూ. ఈ రెంటికీ ఒక బాంధవ్యం ఉంది. ఒకటి విద్యాబుద్ధులనిచ్చే జ్ఞాన, భక్తిప్రద మూర్తి గణపతిని పూజించేదైతే-మరొకటి తమకు అక్షరజ్ఞానమిచ్చి భుక్తి విద్యని ప్రసాదించే ఉపాధ్యాయులను సన్మానించుకొనేది. కనుక ఇవి రెండూ కూడా పిల్లలు ఏకాగ్ర శ్రద్ధతో, ప్రేమతో ఆచరించవలసినవే. అయితే-అవి అలా జరుగుతున్నవా-అన్నదే ప్రశ్న.

గణపతి చతుర్థి ఏర్పడిన కారణాలు రెండు - పిల్లలకు సిద్ధిబుద్ధులిచ్చే దైవంగా, విఘ్నపతిగా, వ్యవసాయ ప్రధానమైన యీ దేశానికి అనుగుణమైన రూపంతో (తొండం నీటి తూముగా, చెవులు చేటలుగా, బొజ్జ గాదెగా, పంటలు స్వాహా చేసే మూషికం వాహనంగా చెప్తారు) కొలువై ఉండటం మొదటిది. ఇక రెండవది ఆధ్యాత్మికపరమైనది. ఆయన ఆకృతే ఆదినాదమైన ఓంకారం అనీ, సాధకులు గణపతి రూపంపై నవవిధాలుగా ధ్యానాదికాలు చేస్తారనీ, పరావిద్యకు గణపతి పరాకాష్ఠ అనీ అంటారు.

ఈయన పూజకు ఇరవై ఒక్క పూలు, ఇరవై ఒక్క పత్రి (ఆకులు) కావాలి. ఇవన్నీ ఔషధ విలువలు కలిగున్నవే. వానలు పడి నేల కడుపులో ఎప్పటెప్పటినుండో దాగి ఉన్న గింజలన్నీ మొలకలై పృథివంతా పచ్చబడే వేళ, చెట్లకు రకరకాల పూలు విచ్చుకొనే వేళ, కలువలు, చేమంతులు

వంటివి దొరికే వేళ వస్తుంది యీ పండుగ. పిల్లలందరూ చెట్లలో, పొదల్లో దూరి, చెరువుల్లో దూకి రకరకాల మొక్కల పేర్లు, వాటి సహజ స్వరూపాలు తెలుసుకొంటూ, ఆయా వనవృక్షాల మధ్య తిరిగినందు వలన కలిగే ప్రయోజనాన్ని (ఆరోగ్యం) పొందుతూ పత్రీ, పూలూ కోసుకొస్తారు. వారికి ఆ ఒక్కరోజులో కలిగే (బొటేనికల్) పరిజ్ఞానం చాలా విలువైంది. అది ఏటా వయసుతోపాటు పరిపక్వత చెందుతూ వస్తుంది. గణపతికి పెట్టే ఉండ్రాళ్లు, కుడుములు, పాలతాలికలు, చలిమిడి-అన్నీ బియ్యప్పిండితో చేసేవే. ఆవిరిమీదనో, పాలతోనో ఉడికేవీను. ఇవి వానాకాలంలో శరీరాలకు కలిగే శైత్యాన్నీ, కీళ్లలో కలిగే బిగింపునూ తగ్గించి, దృఢత్వాన్నిస్తాయి. ఈ గణపతి నవరాత్రులు జాతీయ భావాలు, సమైక్య భావవికాసం మొదలైన ఎన్నో మంచి మార్గాలవైపు నడిపాయి జాతిని గతంలో.

సాధకులకు కూడా గణపతి వ్రతం గొప్ప ప్రయోజనకారిగా యోగశాస్త్రం చెప్తుంది. మరి సామాజిక స్పృహ, ఆరోగ్య రక్షణ, వృక్షజాతిపై అవగాహన కలిగించే యీ పండుగ మనం ఎలా జరుపుకొంటున్నాం? ఎక్కడో, ఎవరో, ఏ మురుగుకాలవల్లోంచో పీక్కు తెచ్చిన అడ్డమైన గడ్డీ రోడ్ల ప్రక్కన అమ్ముతుంటే కొంటున్నాం. స్వగృహా ఫుడ్స్ నుంచో, మరోచోటి నుంచో రెడీమేడ్ కుడుములూ, ఉండ్రాళ్లూ తెచ్చి నైవేద్యం పెడుతున్నాం. (మరీ అతిశయోక్తులు అనెయ్యకండి-నిజంగా యిలా కూడా జరుగుతున్నాయి. మనతరం దాటిపోతే ప్లాస్టిక్ పత్రితో పూజ-ఇంజనీరింగ్ ఫుడ్ నైవేద్యం తప్పవు). ఆ పూజ ఎందుకు చేస్తున్నామో పిల్లలకు చెప్పే వాళ్లు లేరు సరిగదా-పూజ తరువాత ఏడాదంతా దైవధిక్కారం, గురు జనధిక్కారంచేసి ఉంటే దాని దోష పరిహారార్థం గుంజెళ్లు తీసి, మొట్టికాయలు వేసుకొనే సంప్రదాయం ఎప్పడో రూపుమాసిపోయింది. మనకు మనమే ప్రభువులం. కాదంటే మన స్వార్థం, మన రూపాయే మనకు ప్రభువులు-అయినపుడు మనకు గురువులెవరు-వారిని గౌరవించే పనేమిటి?

ఇక ఉపాధ్యాయదినం కథ చూద్దాం-ఏడాదికోసారి-ఎప్పడో చచ్చిపోయిన తాతకు తద్దినం పెట్టినట్లుగా-మొక్కుబడిగా పూర్తి చేసే





తంతుగా మారిపోయిందిది. మహోన్నత వహించిన దొర వార్లంతా, ఉపాధ్యాయుల ప్రాధాన్యం గురించీ, గురువుల పూజ మన దేశానికి ఎంత ప్రాచీనమో అన్న దాని గురించీ ఊదరగొట్టేస్తారు. 'ఉత్తమ ఉపాధ్యాయులం మేమే' అని దరఖాస్తులు చేసుకొన్న వాళ్లలో ఓ పుంజీడు మందిని ఏరి, ఎవార్డులేవో ప్రదానం చేస్తారు. పిల్ల కుంకలు తమకు తోచినట్లు తమ టీచర్లకేవో బహుమతులూ అవీ యిచ్చి తాత్కాలికంగా గౌరవిస్తారు. అంతటితో యీ ప్రహసనం అయిపోతుంది. మళ్లీ ఏడాదికిగానీ ఉపాధ్యాయుడన్న వాడు కూడా మనిషే అని గుర్తుకు రాదెవరికీ.

ఒకప్పుడు రాజులు, చక్రవర్తులు కూడా నెత్తిన పెట్టుకొని పూజించిన గురువుల పరిస్థితి ఎలా ఉందంటే-ఆత్మాభిమానం, దేశ ప్రేమ, సంస్కృతీ గౌరవం ఉన్న ఎవరైనా సరే నేను టీచర్‌ను ఎందుకయ్యాను! ఈ పనికిమాలిన దౌర్భాగ్యపు సిలబస్‌లో నుండీ నేను మంచి పౌరులను సంస్కారవంతులైన మానవులను ఎలా తయారుచెయ్యగలను? - అని దుఃఖించకుండా ఉండలేడు. తరతరాల నీ దేశ సంస్కృతిని చెప్పే నీతి కథల వంటివి మృగ్యం. భాషాగ్రంథాలలో సోషల్‌స్టడీస్‌కో, సైన్స్‌కో చెందిన పాఠాలుంటాయి. తాను కావాలనుకొన్న దానికోసం ఎవరినైనా కిడ్నాప్ చేయవచ్చునన్న సందేశాన్ని అందించేవి కొన్ని, యీ చదువులకన్నా వీధుల్లో తిరిగి జీవితాన్ని అనుభవిస్తేనే ఎక్కువ జ్ఞానం కలుగుతుందన్న దివ్యసందేశం అందించేవి ఇంకొన్నీ, ఈగను మింగిన అవ్వ దాన్ని చంపడానికొక సాలెపురుగునూ, దాన్ని చంపడానికో బల్లినీ ..... అలా అలా పిల్లినీ, కుక్కనూ అలా మ్రింగుతూ పోయే ముసలవ్వ కథలు మరికొన్నీ, సుభద్రకు బలరాముడు తండ్రి అవుతాడని చెప్పేవి కొన్నీ వీటినుంచీ ఏమి నేర్పాలో తెలియక భాషోపాధ్యాయులు నెత్తి మొత్తుకొంటున్నారు.

ఇక సాంఘిక శాస్త్రం చెప్పే వారి పరిస్థితి ముఖ్యంగా 4 - 7 తరగతుల మధ్యలో ఉన్న వారికి చెప్పవలసిన వారి పరిస్థితి అయోమయం. 4, 5 తరగతుల వారికి సైన్సూ, సోషల్ స్టడీసూ కలిపి ఒకటే పుస్తకం. అందులో చరిత్ర, జాగ్రఫీ వగైరాలకన్నా చెత్తే ఎక్కువ. సైన్సు భాగం వరకు ఫర్వాలేదు.

జనంలోకి విద్య వెళ్లాలి. నిజమే-కానీ విద్య మనిషికి అవిద్యావంతులకన్నా ఓ మెట్టు ఎక్కువ విజ్ఞత కలిగించాలి. అది మనం మర్చిపోకూడదు.

వీటన్నిటికీ తలమానికం వంటి పాఠం ఒకటి ఆంగ్లంలో ఉంది. హోం వర్క్ అనేది ఎంత పాపిష్టిదో, పనికిరానిదో, అది పిల్లల జీవితాలను, ఆరోగ్యాన్నీ ఎంత దెబ్బతీస్తున్నదో వైనవైనాలుగా వివరించింది. దీన్ని చెప్పటం ద్వారా ఏ లక్ష్యం సాధించాలో ఏలిన వారికే తెలియాలి. ఇది చెప్పవలసింది విద్యార్థులకా? ఉపాధ్యాయులకా?

అయ్యా, ఇదంతా కడుపుచించుకొంటే కాళ్ల మీద పడుతుందన్నట్లే ఉంది. అసలు, మన ప్రభుత్వంవారు విద్య అన్నదానికి సజీవ సమాధి కట్టేసి, చదువును మాత్రమే బ్రతికిద్దామని చూస్తున్నట్లున్నది. పిల్లల ఎత్తును బట్టి ఏ క్లాసుకు సరిపోతాడో ఊహించి వేసేసే ప్రభుత్వం నుంచీ యింతకన్నా ఏమి ఆశించగలం? గొంగట్లో తింటున్నాం - బొచ్చేరుకొని లాభం ఏముంది? మేం ఇలాంటి దశలో ఉన్నాం. తల్లీ, భారతీ! నీ ఖర్మ ఎలా ఉందో మరి!

పదవ తరగతి పరీక్షల్లో నూటికి నూరు శాతం సాధించాలని పైవారి తాఖీదు-లేదంటే ఏదో ఒక ముప్పు తప్పదు. పిల్లలు సరిగా బడికి రారు. చదవరు. తుంటరిపనులు చేస్తారు. వారిని కోప్పడకూడదు, బెదిరించ రాదు. వాళ్లు పరీక్షల్లో తప్పితే మాత్రం టీచర్లకు శిక్ష అందుచేత మనసులలో చిన్ననాడు నేర్చిన నీతి, ధర్మం వంటివేమైనా ఉంటే అన్నీ కట్టగట్టి, గొంతు నొక్కి, ఎంచక్కా చూచి వ్రాసుకోనివ్వటమే కాదు-తాము కూడా సాయం చేయక తప్పని బ్రతుకులు నేటి టీచర్లవి. ఏలినవారు బాలబాలికల హక్కులను గురించీ, తాము చేస్తున్న ప్రజాక్షేమ (కంటక?) కార్యక్రమాలను గురించీ పదేసి పేజీలు బాదిపారేస్తే-అవన్నీ బోధ పరుస్తూండటమే నేటి ఉపాధ్యాయుల బ్రతుకు. వీటికితోడు చీటికీమాటికీ మీటింగులూ, డైస్ ఫారాలూ, అవి కంప్యూటర్లకు ఎక్కించడాలూ- ఏడాదికి కనీసం మూడుసార్లైనా విద్యార్థుల సంఖ్యా వివరాలు పంపడాలూ, ఖర్మ కాలితే జనాభా లెక్కలూ .... మన్నూ మశానం - దిబ్బా దిరుగుండం - ఈ సంబరాలన్నీ చాలక ఉపాధ్యాయులకు దినం ఒకటా!







# ఆహ్వానం
# శ్రీ కోదండ రామ సాయి సన్నిధానం
# సత్తెనపల్లి

సత్తెనపల్లి రైల్వేగేటుకు దగ్గరలో ఒక చక్కని, సుమారు డెబ్బై అయిదేళ్ల వయసున్న, ఎంతో శక్తివంతమైన కోదండరామస్వామి వారి ఆలయం ఉన్నది. పరమపూజ్య యోగిపుంగవులు 'వాసు దాసు' వారి ప్రతిష్ఠ అది. మంచి తపోభూమి, కాలాంతరంలో 'వాల్మీకి ఆశ్రమం'గా పేరుపొందిన ఆ ఆలయభూమి- క్రమక్రమంగా చేతులు మారుతూ వచ్చింది. కొంత క్షీణదశలోకి రావడమూ జరిగింది. ఆ తరుణంలో -

సాయిదత్త పీఠాధిపతులు, సాయిధామం సేవాశ్రమం (హైదరాబాదు) వ్యవస్థాపకులు, సాయిప్రసన్నులు, పరమపూజ్య గురుదేవులు శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి ఆధ్వర్యంలోనికి వచ్చింది. వారి నిర్వహణలోకి వచ్చిన గత నాలుగున్నర సంవత్సరాలలో ఆశ్రమానికి ఫెన్సింగ్ వేయటం, జలవసతి కల్పించటం, మంటపం పెంచటం, గుడికి మరమ్మత్తులు, పూజారి గృహ నిర్మాణం, ఉత్సవాల నిర్వహణ వారం వారం సత్సంగాలతో దినదినాభివృద్ధి చెందుతున్న సంగతి పరిసరవాసులైన మీ అందరికీ తెలుసు. ఇక యిప్పుడు-

'సాయీ' అని పిలిస్తే 'ఓయీ' అని పలికే దైవం, భక్తుల కొంగు బంగారం, ప్రత్యక్ష దత్తాత్రేయ మూర్తే అనదగిన సంపూర్ణావతారం శ్రీ సమర్థ సద్గురు సాయినాథుల వారి దేవాలయ నిర్మాణం సంకల్పించి ప్రారంభించారు గురుదేవులు. 2013, ఫిబ్రవరి '14న శంకుస్థాపన చేసిన యీ ఆలయానికి ప్రస్తుతం రూఫ్ పూర్తి అయింది. మొత్తం నిర్మాణానికి, విగ్రహానికి, ప్రతిష్ఠకు- అంతా కలిపి పాతిక లక్షలు (రూ.25,00,000/-) అవుతుందని అంచనా. దీని నిర్మాణం పూర్తి అయిన తరువాత కొన్ని సేవా

కార్యక్రమాలు ప్రారంభించవలసి ఉన్నది.

నీవు ఒక్కడుగు నావైపు వేస్తే పది అడుగులు నేను నీవైపు వేస్తానని శ్రీ సాయినాథుల వారి వాగ్దానం. ఒకటికి పది రెట్లు తిరిగి చెల్లించే ఆ స్వామి ఆలయ నిర్మాణం ఒక మహత్తర యజ్ఞం వంటిదే. ఈ పరమపావన మహాయజ్ఞంలో మీరు కూడా కొన్ని సమిధలు వేసి ధన్యులు కండి. ధన, వస్తు రూపాలలో సహకరించదలచిన వారందరికీ ఇదే మా ఆహ్వానం. తరలి రండి - స్వామికొక గుడి కడదాం- ఆయన ఆశీస్సులు పొందుదాం.

సమాజసేవకు కేంద్రం కానున్న యీ మహత్కార్యంలో పాలుపంచుకొనే వారి పేర్లు శ్రీ కోదండ రామ సాయి సన్నిధానంలో వ్రాసి ఉంచబడుతాయి - దిగువ రీతిలో.

**రు. 1,00,000/- సహకారం అందించినవారు 'మణిపుష్పదాత'**

**రు. 50,000/- సహకారం అందించినవారు 'స్వర్ణ పుష్పదాత'**

**రు. 25,000/- సహకారం అందించినవారు 'రజత పుష్పదాత'**

**రు. 11,116/- సహకారం అందించినవారు 'తామ్ర పుష్పదాత'**

రు. 5,116/- సహకారం అందించినవారు 'తులసీదళ దాత'గా **నిలిచిపోతారు.** దైవమిచ్చిన దానిలో కొంత దైవకార్యానికై వినియోగించండి - ధన్యులు కండి - తరలిరండి.

**భక్తులు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు -**

**శ్రీ కంచెర్ల రామయ్య**
**9618065971**
**(కోదండరామసాయి సన్నిధానం నిర్వహణాధికారి)**

**శ్రీ మాతా శుకవాణి**
**9440413455**
**(ప్రధాన కార్యదర్శి, శ్రీ సాయి సేవా సమితి ట్రస్ట్)**

**గమనిక :** 11,116/- రూపాయలు, ఆపైన చెల్లించిన వారి పేర్లు శిలాఫలకం మీద చెక్కించబడతాయి.





## స్వరాంజలి

## సుప్రభాత వేళాయె

- శ్రీమతి కుసుమకుమారి సి.

సుప్రభాత వేళాయె మేలుకో (2) శ్రీ సాయి మేలుకో
పక్షిగణములు నిన్ను కిలకిలా రావాల కీర్తించుచుండెను
మేలుకో షిరిడీశ మేలుకో
అష్టోత్తర నామాల అభిషేకములుసేయ అయ్యవారలు
వచ్చె మేలుకో విఠలేశ మేలుకో ॥ సుప్రభాత॥
కాకడారతిని కనులార గాంచగా నిలచియున్నారయ్యా నీ భక్త
జనులు, మేలుకో .... జగదీశ మేలుకో ॥ సుప్రభాత॥
గోపాల కృష్ణుడవని గోపకాంతలు నీకై వెన్న ముద్దలు తెచ్చిరి
మేలుకో శ్రీరంగ మేలుకో ॥
మేలుకుని మమ్మేలుకో సాయీశ మేలుకో ॥ సుప్రభాత॥

బాలగేయం

## తెలుగు వారి సొంతం

సాయి చైత్ర లక్ష్మి.ఎస్.,
3వ తరగతి

వేడన్నంలో ఆవకాయ
పెరుగన్నంలో మాగాయ
గోంగూరలో ఉల్లిపాయ
తెలుగు వారికి సొంతమేగా!

పప్పు పులుసులో వడియాలు
పనస పొట్టుతో పొడికూర
గారెలు, బూరెలు, పులిహోర
తెలుగు వారి రుచులేగా!

# లేఖావాణి

విజయవాడ,

15-07-2013.

*శ్రీ మాతా శుకవాణిగారికి నమస్సుమాంజలి!*

చాలా సంవత్సరాల నుండి మదిలోనున్న ఆలోచన నిన్నటికి నెరవేరింది. ప్రతిదానికి కార్యకారణ సంబంధముంటుంది గదా! అన్నింటి కంటే సాయీశుని అనుమతి కాలేదు కాబోలు- ఇంతకాలం రాలేక పోయినాను.

అనేక జన్మల సంస్కార పుణ్యఫలితమే సద్గురువు లభించుట, గురు లభ్యత జన్మ సాఫల్యతకు ప్రాతిపదిక. ఎన్ని జన్మల సాధనా ఫలమో, గురుసేవా ఫలమో సంసారము నుండి బయటపడుట. నిన్న 'ఆనందం'గార్ని చూచి మహదానందం పొందితిని, నా నోరు మూగపోయినది. మనస్సు సంకల్ప వికల్ప స్థితిని పొందినది. గురుదేవుల కరుణాకటాక్షవీక్షణాలు శిష్యులలో అనంతశక్తిని జాగృతము చేసి అమానుష కార్యాలను చేయిస్తాయి గదా! మీ గురూజీ తనంతతానై నడిచి వచ్చిన దైవమే గాదు - నడిపించే దైవము. "దైవమ్ మానుషరూపేణ" గదా! మీరెంతటి అదృష్టవంతులో!

జన్మజన్మ పుణ్యాల ఫలము మీ సద్గురువు లభ్యత. జన్మ సాఫల్యతకి ఏమి కావాలి? మీ ఆశ్రమము 'స్వామి తానై నడచి వచ్చిన సాయిధామం" చూచిన తదుపరి నేను పొందిన ఆనందానుభూతిని వర్ణింపలేను. నేను ఏమి కోల్పోతున్నానో తెలియవచ్చింది. నిస్సారమైన జీవితాన్ని గడుపుతూ, రోజురోజుకూ సంసార శృంఖలాలతో బద్ధుడనవుతూ సంసారమనే, ఊబిలో పీకల్లోతులో మునిగి బూడిదగుంటలో పొర్లాడుతూ- కుక్క అనుకొనే విధంగా 'రేపటి నుండి సార్థకమైన జీవనం గడపాల'నే ఆలోచనతో నన్ను నేను మోసపుచ్చుకొంటున్నాను.





అనేకసార్లు 'సాయి సచ్చరిత్ర' పారాయణ చేయాలని ప్రయత్నించి ఆసాంతము పూర్తి చేయలేకపోయినాను. నా అలసత్వమా! చిత్త చాంచల్యమా! పట్టుదల లేకపోవటమా! సాయిదేవుల అనుగ్రహము కలుగకపోవటమా? బహుశాః అన్నీ కావచ్చు.

సాయిధామానికి వచ్చి 2-3 నెలలు ఉండి క్రమబద్ధమైన జీవితం అలవర్చుకోవాలని ఆకాంక్ష. ఎప్పటికి నెరవేరుతుందో! ఏదీ తనంతట తాను రాదు. ప్రయత్నం ఉండాలి. దానికి దైవం తోడ్పాటు ముఖ్యం. అహంకార మమకారాలు చావటంలేదు. రోజురోజుకి బలవత్తరమవుతున్నాయో! ఏమో! తెలియటం లేదు.

పైతృకంగా, వినికిడి ద్వారా కొంత జ్ఞానం కలిగినా అది స్మశాన వైరాగ్యం లాంటిదే అవుతున్నది. ధ్యానం చేయలేకపోతున్నాను. ఒకప్పుడు ధ్యానంలో కొంత నిలకడ అలవడినా సంతతాభ్యాసం లేక ఉన్నది కాస్తా పోయింది. వాచావేదాంతమే మిగిలింది. అనుష్ఠాన వేదాంతం అలవడలేదు. ఏదో ఆర్తి. ఏమి చేయాలో తెలియని స్థితి. యమ మహిష ఘంటికా రావాలు వినిపించే సమయమాసన్నమవుతున్నది గదా! అంతా అయోమయం. ఫలితం తినటం, నిద్రించటం. ఏదో వ్రాస్తున్నాను. ఏమి వ్రాయాలో తెలియటం లేదు. పిండితార్థం ఏమిటంటే కొంతకాలం 'సాయిధామం'లో ఏకాంతవాసం కావాలి. సంసార బంధనాలకు దూరంగా నన్ను నేను ఉద్ధరించుకోవటానికి ఎంతో కొంత ప్రయత్నం.

గురూజీ మౌనము వీడిన తరువాత మరల ఆశ్రమానికి (సాయిధామం) వచ్చి గురువుగారితో కొన్నిరోజులు గడపాలి. వారి యెదుట నా ఆవేదనను వెళ్ళగక్కి సాంత్వనము పొందాలి. శేషజీవితాన్ని ప్రశాంతంగ గడుపుతూ జన్మసాఫల్యం పొందాలనే కోరిక. పరమపూజ్య గురుదేవులకు పునః పునః నమస్సుమాంజలులు.

**- నమస్సులతో**

పి.హేమకోటేశ్వరరావు

# ఎక్కడని వెదకటం?

ఓసారి భగవంతుడు తన సృష్టి అంతటినీ కళ్లారా చూచిరావాలను కొన్నాడు. తీరా ఆయన భూమి మీదికి రాగానే భక్తవరులంతా ఆయనను చుట్టుముట్టారు. "మాకు సంపదలివ్వు స్వామీ! సొమ్ములివ్వుస్వామీ! ఆరోగ్యమివ్వు స్వామీ! ఆనందమివ్వు స్వామీ!'' ఇలా ఊపిరి సలపనివ్వకుండా కోరికలు పుంఖానుపుంఖాలుగా కోరసాగారు. పాపం దేవు(డు ఉక్కిరిబిక్కిరైపోయి ఒకచోటి నుండీ మరోచోటికి పరుగులు తీసాడు. ఎక్కడికి వెళ్లినా భక్తులు గుంపులుగుంపులుగా ఆయన్ని వేధిస్తూనే ఉన్నారు. గుడిలోకి పరుగెత్తాడు స్వామి. మెట్ల నిండా నిజం భిక్షగాళ్లు - లోపల కోరికల భిక్షగాళ్లు. అయోమయంలో పడిపోయాడు స్వామి. చివ్వరికి ఆయనకో ఆలోచన వచ్చింది.

"మనిషికి తన లోపలికి చూచుకొనే అలవాటు లేదు. ఆత్మవిచారణ చేసుకొనే అలవాటు అసలే లేదు. ఒకడి మనసు ఇంకొకడు వెదకలేడు. అందుచేత యీ వెర్రిమంద నుంచీ తప్పకొని దాక్కోవడానికి నాకు ఒకే ఒక్కచోటుంది. అది మనిషి మనస్సే". అంచేత భగవంతుడు మనిషి హృదయంలో దూరి కూర్చున్నాడట. స్వామీ సుఖబోధానంద చెప్పిన కథ యిది.

నాటికీ, నేటికీ వెదకి చూచినాగానీ మనిషికి దైవం అందని కారణం అదే. ఆయన కోసం గుళ్లలో, గోపురాలలో, పూజల్లో, తీర్థయాత్రల్లో వెదుకుతాంగానీ ఆంతర్యంలో వెదకం. ఆంతర్యశోధన చేసుకొని, పరమ జ్యోతికి అడ్డుగా ఉన్న ఆవరణ తొలగిస్తేగాని వెలుగు బయటకు రాదు. చిమ్నీకి ఉన్న మసి తుడిస్తేనే లాంతరులో ఉన్న కాంతి కంటికి కనిపించేది. ఆ కాంతి బయటికి వస్తేనే చుట్టూ ఉన్న వస్తువుల నిజస్వరూపం అర్థం చేసుకోగలం. అంతదాకా భ్రాంతిలోనే పడి, "సర్వమున్నతని దివ్య కళామయమ"న్న మాట మరచిపోయి నేను, నేనులోనే కొట్టుకుంటాం.






కబీరు చెప్పారని జ్ఞాపకం నాకు. ఎవరు చెప్పినాగానీ అద్భుత విషయమే- దూదిని ఏకే యంత్రం వంటిది ఒకటి పరుపులు కుట్టే వాళ్ల దగ్గర ఉంటుంది. మొదట మురికిగా అట్టలు కట్టుకుపోయి ఉన్న పాత దూది ఏకుతున్నంతసేపూ అది హమ్(, హమ్(, హమ్( అంటుంటుందట. బాగా ఏకాక పింజలు పింజలుగా చివ్వరిగా ఏకుతున్నపుడు 'తుమ్హీ, తుమ్హీ, తుమ్హీ' అంటుందట. నిజమే గదా-మనలో అనేకానేక కల్మషాలున్నపుడు 'అంతా నేనే' అనుకుంటాం. నిర్మలత్వం పెరుగుతున్నకొద్దీ "అన్నీ నీవే స్వామీ!" అనుకోవటం నేర్చుకోగలం. నేర్చుకుందాం.

# దీక్ష అంటే?

## శ్రీ రమణులు



(సన్న్యాస దీక్ష ఎవరైనా పీఠాధిపతుల నుంచో, మరొక సన్న్యాసి నుంచో తీసుకోవాలని శాస్త్రోక్తి. అది పరంపరాగతంగా వచ్చే విశ్వాసం కూడా. కానీ, ప్రతి దానికీ ఏదో ఒక విశేషమైన సవరింపు ఉండనే ఉంటుంది. ఆదిశంకరాచార్యుల వారిది స్వీయసన్న్యాసమే గదా! (ఆతుర సన్న్యాసం)! అలాగే శ్రీ రమణ భగవాన్ విషయం కూడా. చదవండి.)

"శృంగేరీ పీఠం నుండి ఎవరో వచ్చి భగవాన్‌ను దీక్షా స్వీకరణం చేసుకో వలసిందని చెప్పారట గదూ!" అని అడిగారు భక్తులు. అవునవును. నేను విరూపాక్ష గుహకు వచ్చిన మొదటిరోజుల్లోనే శృంగేరీ మఠంలో ఉండే ఒక శాస్త్రులవారు నన్ను చూడాలని ఒకనాటి ఉదయాన వచ్చారు. నన్ను చూసి చాలాసేపు మాట్లాడి చాలావరకు సంగతి గ్రహించి భోజనార్థం ఊళ్లోకి వెళ్లబోతూ, నా దగ్గర నిలిచి భక్తితో చేతులు జోడించి స్వామీ! నాదొక విన్నపం ఉన్నది. చిత్తగించాలి అన్నారు. "ఏమది" అన్నాను. వారు వినయవిధేయతలతో ''స్వామీ! తాము బ్రాహ్మణులుగా

జన్మించినందువల్ల శాస్త్రోక్తంగా దీక్షా స్వీకారం చేసుకోవద్దా? పూర్వం నుండి వచ్చిన ఆచారం గదా! అవన్నీ తమకు తెలిసినవే. నేను చెప్పగలది ఏమున్నది! తమరిని మా గురు పరంపరా స్తోత్రంలో చేర్చుకోవలెనని ఉన్నది. అందువల్ల భగవాన్ అనుజ్ఞ యిస్తే మా మఠం నుండి అన్ని సామానులతో యిక్కడికే వచ్చి దీక్ష ఇవ్వగలరు. పోనీ తమకు అఖండ కాషాయం యిష్టం లేకుంటే యీ కౌపీనమైనా కాషాయంగా ధరిస్తే మంచిదని ప్రార్థిస్తున్నాను. మీరు బాగా యోచించి ఉత్తరువు నీయవచ్చును. నేను కొండ దిగి భోజనము చేసి మూడు గంటల వేళకు తిరిగి రాగలను. మా మఠంలో అందరూ మిమ్మును గురించి ప్రసిద్ధిగా విని చూచి రమ్మని పంపితే వచ్చాను, అనుగ్రహించాలి" అని చెప్పి వెళ్ళారు. వారు వెళ్లిన కాసేపటికల్లా ఒక వృద్ధ బ్రాహ్మణుడు ఒక మూట పట్టుకొని వచ్చాడు. ముఖం ఎప్పుడో చూసినట్లే ఉంది. ఆ మూటలో పైన పుస్తకాలున్నట్లు బైటికి తెలుస్తూ వున్నది. వచ్చీ రావడమే ఆ మూట నా యెదుట పెట్టి చిరపరిచితునివలె "స్వామీ! నేను యిప్పుడే వచ్చాను. స్నానం చేయలేదు. ఆ మూట చూచేవారు ఎవరూ లేరు. కొంచెం చూచుకో" అని చెప్పి వెళ్ళాడు. వారటు వెళ్ళగానే ఎందుకో ఆ మూట విప్పి పుస్తకాలు చూద్దామన్న బుద్ధి పుట్టింది. ఆ మూట విప్పగానే "అరుణాచల మాహాత్మ్యం" అన్న సంస్కృతాక్షరాలున్న గ్రంథం నా కంటబడ్డది. ఈ మాహాత్మ్య సంస్కృతంలో గూడా ఉన్నదన్న సంగతి నాకు లోగడ తెలియదు. అందువల్ల ఆశ్చర్యం కలిగి పుస్తకం తెరిస్తే, ముందు ఈశ్వర వాక్కుగా స్థల విశేషాన్ని గురించి చెప్పిన ఈ శ్లోకం కంటపడ్డది.

"యోజనత్రయ మాత్రేऽస్మిన్ క్షేత్ర నివసతాం నృణాం" ।

దీక్షాదికం వినాప్యస్తు మతా యుజ్యం మమాజ్ఞయా ॥

"ఈ స్థలమునకు 3 యోజనముల లోపల నివసించే వారికి ఆచరించదగిన దీక్షాదులేమీ లేకున్నప్పటికీ పాశరహితమైన నా సాయుజ్యము సిద్ధము".

ఈ శ్లోకం చూడగానే 'ఆఁ! సరి, సరి ఆ శాస్త్రుల వారికి చెప్పేందుకు యిది సరియైన సమాధానమని వెంటనే ఆ ఒక్కటీ కాపీ చేసుకొని ఆ వృద్ధ బ్రాహ్మణుడు ఎక్కడ రాబోతాడోనని యథాప్రకారం మూటకట్టి పెట్టాను. సాయంత్రం శాస్త్రులవారు రాగానే యీ శ్లోకం చూపాను. వారన్నీ చదివిన వారే గనుక, మరి మాట్లాడక అతిశయించిన భయభక్తులతో నమస్కరించి వెళ్లిపోయి, నృసింహ భారతుల వారికి యీ విషయమంతా చెప్పారట. వారెంతో నొచ్చుకొని "ఇక చాలును, ఈ ప్రయత్నం విరమించండి" అని అన్నారట.

ఈ మూట పెట్టిన వృద్ధ బ్రాహ్మణుడు తిరిగి రాలేదు. (దాని అర్థము ఈశ్వరుడే ఆ రూపములో వచ్చి బిడ్డయైన శ్రీ రమణులను ఆదుకొన్నారనుటలో అతిశయోక్తి లేదు.)

## అర్థం చేసుకోవటం

When somebody irritates you, stop immediately and think out what makes him to act the way. Trying to understand 'why' a person acts the way it helps you to be much more understanding. It was wise old Aristotle, who said "to understand all is to forgive all".

- ఎవరైనా నీకు చికాకు కలిగించి, రెచ్చగొట్టే పరిస్థితి తెచ్చారనుకో. రెచ్చిపోకు. ఒక్కసారిగా ఆగిపోయి ఆలోచించు. "వీడిలా ఎందుకు ప్రవర్తిస్తున్నాడు? నన్ను చికాకుపెట్టాలని ఎందుకు చూస్తున్నాడు?" అని తర్కించుకో. అలా ఆలోచించటం వలన నీలో తార్కికశక్తి, అవగాహనా శక్తి పెరుగుతాయి. అవగాహన వలన ఉద్రిక్తత తగ్గుతుంది. ఫలితం ఏమిటి? మహావేత్త అరిస్టాటిల్ అన్నాడు-"అందరినీ అర్థం చేసుకోవటం అంటే అర్థం-అందరినీ క్షమించటమే" అని.

# సాయితో తర్ఖడ్ స్మృతులు-4

- శ్రీ వీరేంద్ర జ్యోతీంద్ర తర్ఖడ్

(గత సంచిక తరువాయి)

మా చందనపు మందిరంలో వినాయకుని చిన్న పాలరాతి విగ్రహం కూడా ఉంది. ఇది ఒక అపూర్వమైన విగ్రహం. ఎందుకంటే వినాయకుని తొండం కుడివైపుకు తిరిగి ఉంది. విగ్రహం వెండి సింహాసనంలో ఉంది. దాని కోసం అది ప్రత్యేకంగా తయారుచేయబడింది. వినాయక విగ్రహం కథ చాలా ఆసక్తికరంగా ఉంటుంది. దీనికి సంబంధించిన గొప్పతనమంతా బాబాకే చెందుతుంది.

మా తాతగారు బొంబాయి రీగల్ థియేటర్ దగ్గర పురాతన వస్తువులు అమ్మే దుకాణానికి వెడుతూ ఉండేవారు. ఒకసారి అలా వెళ్ళినపుడు, షాపు యజమానితో ఒక ఆంగ్లేయుడు బేరమాడుతూ ఉండడం వినపడింది. ఒక ఆంగ్లేయుడు బేరమాడుతూ ఉండటంతో మా తాతగారికి కుతూహలం పెరిగింది. ఆసక్తిగా గమనించడం మొదలుపెట్టారు. ఆ బేరం అందమైన పాలరాతి వినాయక విగ్రహం గురించి జరుగుతోంది. అది తొమ్మిది అంగుళాల పొడువుతో పద్మంలో కూర్చొని ఉండి దానికి తగినట్లుగా రకరకాల రంగులతో రంగు వేయబడి ఉంది. దాని ధర రు.15/- అనీ అది సోమనాథ్ మందిరం నుంచి వచ్చినదనీ, చాలా పురాతనమైనదని, అందువలన దానికి ఆ ధర న్యాయమైనదనీ చెప్పాడు దుకాణంవాడు. ఆ ఆంగ్లేయుడు ఆ వినాయక విగ్రహానికి రూ.5/- నుండి రూ.8/-ల వరకు ఇవ్వడానికి సిద్ధమయ్యాడు. మా తాతగారు ఆ బేరసారాలకు ఆకర్షితుడై, ఆ విగ్రహంతో ఏమి చేయబోతున్నారని అతనిని అడిగారు. ఆంగ్లేయుడు తానా పాలరాతి విగ్రహాన్ని తన బల్లమీద పేపర్ వెయిట్‌గా వాడుకోవడానికి కొంటున్నానని చెప్పాడు. ఇది వినేటప్పటికి తాతగారికి చాలా కోపం వచ్చింది. ఆయన వెంటనే తన పర్స్ నుండి రు.80/- తీసి షాపతనికి ఇచ్చారు.

ఆ విగ్రహానికి ఆంగ్లేయుడు అడిగిన దానికన్నా పదిరెట్లు ఎక్కువ ఇస్తున్నాననీ, తనకు ప్యాక్ చేయమనీ చెప్పారు. తమ దేవుడిని మరెవ్వరూ కూడా 'పేపర్ వెయిట్'గా ఉపయోగించనివ్వనని చెప్పారు. ఆ విగ్రహం సోమనాథ్ మందిరం ప్రధాన ద్వారం దగ్గర ఉండేదనీ, అది చాలా పురాతనమైనదనీ తెలిసింది తరువాత దుకాణదారుని ద్వారా.

ఇంటికి వెళ్ళగానే ఆ విగ్రహాన్ని చందనపు మందిరంలో ఉంచి 'సాయి'తోపాటు దానిని కూడ పూజిస్తానని చెప్పారు. కుటుంబంలోని వారంతా ఆయన చెప్పిన సూచనకు అంగీకరించారు. ప్యాకెట్ విప్పగానే మా నానమ్మగారు విగ్రహం యొక్క తొండం కుడివైపునకు తిరిగి ఉందనీ, ఇటువంటి సిద్ధి వినాయక విగ్రహం సాధారణంగా ఇంట్లో పూజ కోసం ఉంచుకోకూడదనీ, ఇది ఉంటే ఇంటిలో ఆచార వ్యవహారాలు చాలా ఖచ్చితంగా పాటించాలనీ చెప్పారు. అప్పుడు ఆయన ఒక పూజారి గారిని సంప్రదించగా, ఆయన ఒక షరతు ప్రకారమైతే విగ్రహాన్ని పూజించవచ్చు అన్నారు.

అదేమిటంటే ప్రతి వినాయక చతుర్థినాడు మరల దానికి రంగు వేసి దానిని నిమజ్జనం చేయకూడదని చెప్పారు. అటువంటి పరిష్కారం సూచించినందుకు తార్ఖడ్ కుటుంబం అంతా సంతోషించి అటుపై రాబోయే గణేష్ చతుర్థికి, విగ్రహానికి వెండి సింహాసనం తెచ్చి, శాస్త్రోక్తంగా దానిని చందనపు మందిరంలో ప్రతిష్ఠించారు. అప్పటినుండి ప్రతి 'హర్తాలికకి' (వినాయక చవితికి) ఒకరోజు ముందు మా నాన్నగారు విగ్రహానికి టర్పంటైన్‌తో పాతరంగుని తొలగించేవారు. తరువాత దానికి పరిమళపు నీటితో (సెంటెడ్ వాటర్) స్నానం చేయించేవారు. మాలో

ప్రతి ఒక్కరం కూడ అందులో పాల్గొని దానికి మరల రంగులు వేసేవాళ్లము.

వినాయక చతుర్ధినాడు దానిని మరల వెండి సింహాసనంలో ప్రతిష్టించేవారు. మేమంతా కలసి పూజ చేసేవారము. నా చిన్నప్పుడు స్కూలు స్నేహితులు నన్ను, మీరు గణపతిని తెచ్చుకున్నారా?" అని అడుగుతూ ఉండేవారు. నేను మా ఇంట్లో శాశ్వతంగా ఉన్నాడని చెబుతూ ఉండే వాడిని. అప్పుడు నన్ను వారు అర్థం చేసుకోలేకపోయేవారు.

ఈ పూజలతో తార్ఖడ్ వారంతా ప్రార్ధన సమాజ్ నుంచి విగ్రహారాధకులుగా మారిపోయారు. మా ఇంటిలో ఉన్న ఈ వినాయక విగ్రహానికి మా నానమ్మగారు ఒకసారి చిన్న పరీక్ష చేసారు. మా తాతగారికి వస్త్ర పరిశ్రమలో మంచి పేరు ఉంది. ఆయనకు బరోడా మహారాజా వారి నుంచి మన రాష్ట్రంలో వస్త్ర పరిశ్రమ స్థాపించే బాధ్యత ఇవ్వబడింది. అందుచేత వారు బరోడాకి నివాసం మార్చారు. వారికి నది ఒడ్డున ఒక బంగళా వసతి కోసం ఇచ్చారు.

ఒకసారి వర్షాకాలంలో రాత్రంతా పెద్ద వర్షం కురిసింది. ప్రొద్దునకల్లా (ఉదయానికల్లా) వారి బంగళా నీటితో నిండి ఉంది. ఇది వారికొక కొత్త అనుభవం. గంట గంటకి నీటిమట్టం పెరుగుతూ ఉండటంతో మా నాన్నమ్మగారు భయపడ్డారు. ఆఖరి మెట్టు తప్ప బంగళా మెట్లన్నీ నీటిలో మునిగిపోయి ఉన్నాయి.

అప్పుడు మా నానమ్మగారు మట్టం సరిగా ఉన్న రాగిపాత్రను తెచ్చి ఆఖరి మెట్టు మీద పెట్టారు. ఆమె వెండి సింహాసనం నుండి గణపతిని "విఘ్నహర్త" అని పైకి తీసి రాగి పాత్రలో ఉంచి, విగ్రహం కనక నీటిలో మునిగిపోతే, అదే నీటిలో వినాయక నిమజ్జనోత్సవం జరుపుతానని చెప్పేశారు. అటువంటి ప్రమాదకర పరిస్థితి నుండి వినాయకుడు తమని రక్షిస్తారనే దృఢమైన అభిప్రాయం కావచ్చు ఆవిడది. బాగా భక్తిభావం ఉన్న దృఢమైన భక్తులు మాత్రమే అటువంటి సాహసం, అటువంటి సాహసోపేతమైన చర్యలు చేయగలరని అని నేననుకుంటున్నాను.





దేవుడు కూడ అలాంటి వారిని యిష్టపడే అవకాశం ఉంది. నీటి మట్టం యింకాస్త పెరిగి రాగిపాత్రను తాకి, యిక పెరగడం ఆగిపోయింది. మూడు, నాలుగు గంటల తరువాత నీటిమట్టం తగ్గిపోవడంతో అంతా సంతోషించారు. వారు కోరుకున్న ప్రకారం వారి "విఘ్నహర్త" వారిని రక్షించారు.

ఆ సంవత్సరం వారు గణేష్ చతుర్థిని ఒకటిన్నర రోజులకు బదులు అయిదు రోజులు జరుపుకున్నారు. గణేష్ మూర్తిని గాంచి అంతా సంతోషించాము.

మరియొక సంఘటన వివరించుకుందాం. 'గణేష్ విగ్రహాన్ని రక్షించిన సాయి' అని అనుకున్న విషయం సార్థకత మనకు కనిపిస్తుంది. ఒక వినాయక చవితి రోజున పాత రంగు వేస్తున్నపుడు విగ్రహం యొక్క కుడి చేయి, మోచేయి నుండి పట్టు తొలగింది. మా నాన్నగారు చాలా భక్తిపరులు. హిందూ సిద్ధాంతము ప్రకారం పాడయిన విగ్రహాన్ని పూజించ రాదు. ఏమయినప్పటికీ అది యిప్పుడు కుటుంబంలో ఒక భాగము అయిపోయింది. వారు దానిని వదలుకోవడానికి ఇష్టపడలేదు వారు. అంచేత ఉత్సవం జరుపుకోవాలని నిర్ణయించుకొని అప్పడు సాయిబాబా సలహా తీసుకుందామనుకున్నారు. ఆ విధంగా వారు షిరిడీకి బయలుదేరారు.

ప్రియ పాఠకులారా! అది వారు తప్ప చేస్తున్నట్లు కాదూ! వారెప్పడు బాబాని వినాయక వ్యవహారాల్లో సంప్రదించలేదు. ఇప్పడు కష్టం వచ్చేటప్పటికి ఆయన సహాయం కావలసి వచ్చింది. ఆ సమయంలో వారు ద్వారకామాయిలో ఉన్నారు. బాబా అసాధారణంగా వారితో మౌనంగా ఉన్నారు. వారు తమ తప్పను తెలుసుకుని మొదటినుంచి బాబాని

సంప్రదించనందుకు తప్పు చేశామనే భావం కలిగింది. వారు లోలోపల ఆయనను క్షమించమని కోరారు. వారు బాబా దయకోసం ఓర్పుతో ఎదురుచూశారు. అప్పుడు ద్వారకామాయిలో జనం తగ్గిపోయాక బాబా వారిని దగ్గరకు పిలిచి ఇలా అన్నారు -

"ఓ అమ్మా! మన కొడుక్కి చేయి విరిగితే అతనిని మన యింటి నుంచి వెళ్ళగొట్టము కదా. దానికి ప్రతిగా అతనికి తిండి తినిపించి కోలుకొనేలా చేసి, తిరిగి మామూలు మనిషి అయ్యేలా చేస్తాము". ఇది వినగానే వారు వెంటనే ఆయన పాదాల మీద పడి మనఃస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుకున్నారు. ప్రియ పాఠకులారా, బాబా విజ్ఞతను వర్ణించడానికి నేను తగిన మాటలు కనుగొనలేకపోతున్నాను.

ఆయన నిజంగా "అంతర్జ్ఞాని". నిజం చెప్పాలంటే నీ మనస్సులో ఉన్నది ఆయన చదవగలరు. బాబా లీలలు అంత గొప్పవి. అ తల్లీ కొడుకు లిద్దరూ కూడ అంత గొప్పవారు. ఈ విధంగా బాబా ఇంతవరకు యిప్పటి వరకు కూడ తార్ఖడ్ కుటుంబంలో పూజలందుకుంటున్న వినాయక విగ్రహాన్ని రక్షించారు.

**(ఇంకా ఉంది)**

ఒక శత వృద్ధురాలు కర్రపోటు వేసుకొంటూ సగానికి సగం వంగి పోయి నడుస్తున్నది. ఆ దారిన వెడుతున్న కొందరు యువకులు ఆమెను చూచారు. అందులో ఒక వాచాలుడు (వాగుడుకాయ) ఉన్నాడు. వాడు కొంటెతనంతో ఆ అవ్వకు దగ్గరగా వెళ్ళి "ఏమవ్వా, ఏం పోగొట్టుకున్నావు- నేల మీద వెదుకుతున్నావు?" అని అడిగాడు. అవ్వ తలెత్తి చూచి "అవు న్నాయనా, నా యవ్వనం పోయింది - వెదుకుతున్నా. నీకు దొరికిందేమో- ఇస్తావా!" అంది. కోణంగి నోరు మూసుకొని తలవంచుకొని వెళ్ళిపోయాడు. (-ఎక్కడిదో!!)







ఓం శ్రీ సాయిరాం

# షిరిడీ డైరీ

**– మాన్యశ్రీ జి.ఎస్. కపర్దే**

**అనువాదం : మాతా శుకవాణి**

(గత సంచిక తరువాయి)

14-12-1911

ఊరికి వెళ్ళిపోయే కోరికతో నేను పెందలకాడ లేచి కాకడ హారతికి వెళ్ళి, హడావుడిగా ప్రార్థన ముగించి, మాధవరావు దేశ్‌పాండేతో కలిసి మసీదుకు వెళ్లాను. సాయి మహరాజు నేను మరునాడో అటుపైనో వెళ్లవచ్చునంటూ నేను దైవాన్ని తప్ప మరెవ్వర్నీ సేవించకూడదన్నారు. "మనిషి ఇచ్చేది నిలవదు. దైవమిచ్చేది పోదు'' అని కూడా అన్నారు. నేను తిరిగి వచ్చేసరికి కళ్యాణ్‌కు చెందిన దర్వేష్ సాహెబ్ ఫాల్కే వచ్చారు. ఆయన పాత ఫాయాకు చెందిన చాలా మంచి పెద్దమనిషి. అతనితోపాటు షింగ్ణే, ఆయన భార్య కూడా ఉన్నారు. షింగ్ణే బొంబాయిలో పెద్ద వకీలు. ఆయనకు న్యాయతరగతులు కూడా ఉన్నాయి. నేను మధ్యాహ్న పూజకు వెళ్ళి, బాపూ సాహెబ్ జోగ్‌తో ఫలాహారం చేసాను. ఆ తరువాత పడుకొని నిద్ర పోయాను. మసీదుకు కాస్త ఆలస్యంగా వెళ్లాను. చావడి దగ్గర నమస్కారం చేసుకున్నాను. దర్వేష్ సాహెబ్, షింగ్ణేలతో మాట్లాడుతూ కూర్చున్నాను. తరువాత భీష్మ తన అను దిన భజన చేసాడు.

15-12-1911

ఉదయం ప్రార్థనల తరువాత దర్వేష్ ఫాల్కే, షింగ్ణేలతో మాట్లాడుతూ కూర్చున్నాను. అతన్ని హాజీ సాబ్ అని కూడా పిలుస్తారు. ఆయన బాగ్దాద్, కాన్‌స్టాంటినోపిల్, మక్కాలన్నీ తిరిగి వచ్చాడు. ఆయన సంభాషణ చాలా

ఉపదేశాత్మకంగాను, ఆనందకరంగాను ఉంటుంది. సాయి మహరాజు ఆయనను చాలా అభిమానంతో చూస్తారు. భోజనాదికాలు, యితర వస్తువులు పంపుతారు. సాయిమహరాజు బయటికి వెడుతుండ గాను, మసీదులోను కూడా చాలా ఉత్సాహంగా ఉన్నారు. ఆయన సంభాషణకు మేమంతా ఆనందించాం. భోజనా నంతరం కాస్సేపు కునుకుతీసి లేచాను. అటుపై మా అబ్బాయి బల్వంత్ ఢిల్లీ గురించి చదువుతుంటే వింటూ కూర్చున్నాను. అప్పుడు మసీదుకు వెళ్లి సాయి ఆశీస్సులు తీసుకున్నాం. శేజారతికి కూడా వెళ్లాము తరువాత.

16-12-1911

నాకు బాగా జలుబు చేసింది. కాకడ హారతివేళకు లేవలేకపోయాను. మూడు గంటలకు లేచి మళ్లీ నిద్రపోయాను. దర్వేష్ సాహెబ్‌తో మాట్లాడాను ప్రార్థన తర్వాత. ఆయనను హజ్రత్ అనీ హాజీ సాహెబ్ అని కూడా పిలుస్తారు. హిందూ ధర్మాన్ని బట్టి అయితే ఆయనను కర్మయోగి అనాలి. ఎన్నెన్నో ముచ్చటలు చెప్తాడు. సాయి మహరాజు మంచి ఉల్లాసంగా ఉన్నారు. హాస్యాలాడుతూ కబుర్లు చెప్పారు. హారతి తరువాత వాడాకు వచ్చి భోజనానంతరం అమరావతి నుండి అమృత బజారు పత్రికతోపాటు రెండు 'బోంబే ఎడ్వొకేట్' పుస్తకాలు కూడా పంపారు-అవన్నీ చదవాల్సి ఉంది నేను. సెషన్స్ కేస్ నాకప్పగిస్తూ మూడు రోజులనాడు ఒక టెలిగ్రాం వచ్చింది వార్ధానుండీ. కానీ, సాయి మహరాజు నాకు తిరిగి వెళ్లడానికి అనుమతి ఇవ్వకపోవటంతో నేనది తిరస్కరించాను. ఇవ్వేళ్టి టెలిగ్రామ్ దాని ఫలితమే. మాధవరావు దేశ్‌పాండే నా తరఫున అనుమతి కోరితే మర్నాడో, ఓ నెల తరువాతో వెళ్లవచ్చు నన్నారు. అంచేత విషయం నిర్ణయమైపోయింది. నేను యథా విధిగా సాయికి చావడి ముందర నమస్కారం చేసుకున్నాను. హారతి తరువాత వాడాలో భీష్మ భజన విన్నాను. ఇవ్వేళ వచ్చిన కొత్త వారిలో హాటే ఉన్నాడు. అతని తండ్రి న్యాయాధిపతి (జడ్జ్) అమరేలీలో. తరువాత పాలిటానాలో దివానుగా చేసారు. ఆయన పినతండ్రిని నేనెరుగుదును.

**(సశేషం)**







# శ్రీ సాయి-సేవ



## శ్రీసాయి సేవ అవసరమా?

**– సాయివాణీ ప్రచురణలు**

**(గత సంచిక తరువాయి)**

### ఏ సేవైనా ఆయనకే

మనం ఎవరికి నిష్కామంగా ఏ విధమైన సేవ చేసినా ఖచ్చితంగా అది దైవానికే చెందుతుంది. ఈ విషయం శ్రీ సాయి చరిత్రలో మనకెన్నో చోట్ల కన్పిస్తుంది.

ఒక ఇల్లాలు బాబా దర్శనం కోసం షిరిడీ వచ్చింది. ఆ రోజుల్లో హొటళ్ళూ అవీ ఉండేవి కావు షిరిడీలో. అంచేత ఆమె ఒకరి యింట్లో డబ్బిచ్చి భోజనం చేసి, మధ్యాహ్నం సాయిబాబా దర్శనానికి వచ్చింది. బాబా ఆమెను చూడగానే "నీవు ఇవ్వాళ పెట్టిన రొట్టె తిని నేను సంతృప్తి చెందాను. రోజూ యిలాగే పెట్టు తల్లీ!" అన్నారు. "నేనే ఎవరింట్లోనో తిని వచ్చాను. మీకెప్పుడు భోజనం పెట్టాను సాయీ?" అన్నదామె.

"నీవు భోజనం చేసేటప్పుడు ఎవరికి ఏం పెట్టావు?" అని అడిగారు బాబా. ఒక నల్లకుక్క వస్తే రొట్టె పెట్టానన్నది ఆమె. "మరి యింకేమమ్మా! ఆ కుక్కా నేనూ ఒకటే-ఆకలితో ఉన్న ఏ జీవి కడుపు నింపినా నీవు నా కడుపు నింపినట్లే" అన్నారు బాబా.

మరోసారి ఉపాసనీశాస్త్రి వంటచేసి బాబాకు నివేదన చెయ్యటం కోసం మసీదుకు వస్తోంటే దారిలో కుక్క ఒకటి వెంటబడింది. ఉపాసనీ శాస్త్రి దాన్ని తోలేసి బాబా కోసం తెచ్చిన ఆహారాన్ని బాబా స్వీకరించలేదు. "ఆకలితో అక్కడికి వస్తే పెట్టలేదు గానీ యిక్కడికి తెచ్చావా?" అన్నారు.

ఒక హరిజనుడు ఎదురైనపుడు కూడా ఉపాసనీ చికాకుపడితే బాబా అలాగే చేసారు.

ఒకసారి బాబా లక్ష్మీబాయి షిండేతో తనకు చాలా ఆకలిగా ఉన్నదని చెప్పారు. తీరా ఆమె హడావుడిగా వంటచేసి తెస్తే మొత్తం కుక్కకు వేసారు. అయ్యో, రుచైనా చూడకుండా అలా చేసారేమిటని లక్ష్మీబాయి బాధపడితే- ఆ కుక్కలో ఉన్న ఆకలీ, తన ఆకలీ ఒకటేననీ, దాన్ని సంతృప్తిపరిస్తే తనకు పెట్టినట్లేననీ అన్నారు.

అలా ఆయన అనేకసార్లు ఏ జీవికి సేవ చేసినా అది తనకే చెందుతుందని చెప్పారు. అంటే నిష్కామంగా మనం చేసే సేవలు పరమాత్మకే చెందుతాయన్న మాట. అనూచానంగా వచ్చే గాథలు యిలాంటివి ఉన్నాయి ఒకటిరెండు.

ఒక నిరుపేద వ్యక్తి ఉన్నాడొక గ్రామంలో. ఊళ్ళోని చర్చి దగ్గర ఆయన కొక వార్త తెలిసింది. ఆ రోజు చాలా పవిత్రమైన రోజనీ, ఆరాత్రి దేవుడు తన గ్రామంలోని భక్తులందరి యిళ్ళకూ వస్తారనీను. అమ్మో! భగవంతుడే నడిచి తన యింటికి వస్తే తానేమి యివ్వగలడు! ఏమున్నాయి తన దగ్గర యివ్వడానికి! గుడిసె అంతా గాలించినా చారెడు గోధుమపిండి తప్ప మరేమీ దొరకలేదు.

"దీనితో రొట్టెలు చేసి ఉంచుతాను. స్వామి వస్తే అవే యిస్తాను" అనుకొన్నాడతను. సరే - యిల్లూ వాకిలీ శుభ్రం చేసాడు. ఉన్న పిండితో మూడు రొట్టెలు చేసాడు. స్వామి వస్తే పెట్టడానికి పళ్లెం, గ్లాసు కడిగి పెట్టాడు. ఇంక ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

సాయంత్రం అయింది ..... రాత్రి అయింది .... విపరీతమైన చలి. తలుపు తెరుచుకొని అలాగే కూర్చున్నాడు మన పేదవాడు. అర్ధరాత్రి అయింది. దేవుడు రాలేదు గానీ ఒక శతవృద్ధుడు చలికి వణుకుతూ వచ్చాడు.





మనవాడు ఆయనను లోపలికి రమ్మన్నాడు. అతడు ఆకలిగా ఉన్నదనీ.... ఏమైనా పెట్టమనీ అడిగాడు. ఇతడు 'దేవుడికి చేసినవి యితని కివ్వటమా!' అని మొదట సందేహించాడు. కానీ ఆ వృద్ధుడి దీనత్వాన్ని చూచి మనసు కరిగిపోయింది. ఒక రొట్టె తెచ్చి అతనికి పెట్టాడు. ఆకలి తీరిన వృద్ధుడు ఇతన్ని ఆశీర్వదించి వెళ్లిపోయాడు. మళ్లీ మనవాడు నిరీక్షణలో పడ్డాడు.

రెండు గంటలయింది. "స్వామి ఏయే భాగ్యశాలుర యిళ్లల్లో ఎవరిని ఆశీర్వదిస్తున్నాడో! నావంటి నిరుపేద భక్తుడు ఆయనకు గుర్తుంటాడా!" ఇతని మనసులో సందేహం. అంతలో బయట చప్పుడయింది. దేవుఁడా? ఇతడు గభాల్న లేచి నిలబడ్డాడు. ఊహూ! దేవుఁడు కాదు.... కుక్కపిల్ల. బలహీనంగా కుఁయ్ కుఁయ్ మంటూ తోడ ఆడిస్తోంది. ఇతనివైపు ఆశగా చూస్తూ ఉండి ఉండి కుక్కపిల్ల వెల్లకిల పడుకొని కాళ్ళు ఎత్తి కుఁయ్ కుఁయ్ మన్నది. ఇతనికి అర్థమైంది దానికి ఆకలేస్తోందని. జాలీ, బాధా కలిగాయి. మరేమీ ఆలోచించకుండా మరో రొట్టె తెచ్చి ఆ కుక్క ముందు వేసాడు. అది గబగబ ఆత్రంగా తినేసి అతని కాళ్ల దగ్గరే ముడుచుకు పడుకున్నది.

మూడు కావస్తోంది. ఒక భిక్షకురాలు వణుకుతూ వచ్చి వాకిట్లో చతికిలబడింది. ఆమె చంకలోని రెండేళ్ల పిల్లవాడు ఏడుస్తున్నాడు. వాడిని సముదాయించి ఆపలేక ఆమె కూడా ఏడుస్తున్నది. మన పేదవాడు వెళ్లి "ఏమయిందమ్మా!" అని అడిగాడు.

"ఏమీ లేదు బాబూ, రోజూ ఊరంతా తిరిగితే నాలుగైదు రొట్టెలన్నా దొరుకుతాయి. ఇవ్వాళ దేవుఁడు వస్తున్నాడట భక్తుల యిళ్లకు. ఆయన రాకముందే వాడితే వండినవన్నీ ఎంగిలైపోయినట్లేనట-అందుకని ఎవ్వరూ ఏమీ పెట్టలేదు బాబూ! వీడేమో నన్ను చంపుకు తింటున్నాడు"

అని తల్లి వెక్కెక్కి ఏడ్చింది. ఇతనికి కూడా కన్నీళ్ళు వచ్చాయి.

ఆలోచనలో పడ్డాడు. దేవుఁడింత వరకూ రాలేదు. ఇప్పటికే ఎందరెందరో ఆయనకు రకరకాల మిఠాయిలు, పళ్ళు, ఫలహారాలు పెట్టే ఉంటారు. తాను చేసిన బండరొట్టె ఆయనకేం రుచిస్తుంది! ఆకలితో అల్లాడుతున్న యీ చిన్నబిడ్డ కడుపు నింపకుండా చూస్తూ ఊరుకొని దేవుఁడికివ్వటం దేనికి? - అతనిక సంకోచించలేదు. గబగబ మిగిలిన రొట్టె తెచ్చి ఆ పిల్లవాడి చేతిలో పెట్టాడు. వాడు దాన్ని తింటున్నంత సేపూ చూస్తూ నిలబడ్డాడు. అటుపైన సంతోషంగా లోపలికి వెళ్ళిపోయాడు.

నాలుగైంది. ఇక దేవుఁడు రాడు .... ఒకవేళ వచ్చినా తన దగ్గర ఏమీ లేదు అతనికివ్వడానికి. నిశ్చింతగా పడుకొని కళ్ళు మూసుకున్నాడు తలుపు మూసి.

పది నిముషాలు గడిచాయో లేదో తలుపు మీద చప్పడైంది. మన వాడు ఉలిక్కిపడ్డాడు. ఈసారి ఎవరో అనుకుంటూ వెళ్ళి తలుపు తెరిచాడు. భగవంతుడు! కరుణ చిమ్మే కళ్లతో, వెన్నెలలు విరిసే నవ్వుతో, ఆప్తత నిండిన చూపుతో ... కాంతులు చిందే రూపం! పేదవాడికి ఎందుకో పట్టరాని దుఃఖం వచ్చింది.

చటుక్కున దేవుఁడి పాదాలంటి నమస్కరించాడు. “స్వామీ, ఈ దరిద్రుడిని గుర్తు పెట్టుకొని వచ్చావా! ఏమివ్వగలను తండ్రీ నీకు! ఏమీ లేనివాడినయ్యా!” అన్నాడు కన్నీళ్ళతో. స్వామి చల్లగా చూచాడు. మెల్లగా నవ్వాడు. అతన్ని రెండు చేతులతో లేపి నిలబెట్టాడు. కళ్ళలోకి దయగా చూస్తూ “మూడుసార్లు పెట్టావు - ఇంకెన్నిసార్లు పెడతావయ్యా!” అన్నాడు మెత్తగా. నిరుపేదవాడికి అర్థమైంది - స్వామి తన సేవ అంగీకరించాడని. (ఇది టాల్‌స్టాయ్ కథకు అనుసరణ)

**(సశేషం)**





# మాతృసంస్థ కబుర్లు

2013, జూలై నెల 16వ తేదీ మంగళవారంనాడు సాయిధామంలోని బాలబాలికలందరూ హనుమాన్ చాలీసా 108 ఆవర్తాల పారాయణ చేసి, శ్రీ సాయి మారుతిని వడమాలతో అలంకరించి, తమలపాకులతో, పూలతో పూజించారు. 19వ తేదీ తొలి ఏకాదశి. పండుగలకు ఆదియైన యీ రోజు పేలపిండి ప్రసాదంతో, నామ పారాయణతో గడిచింది. 20వ తేదీ సాయంత్రం భాస్కరపురం (సైనిక్‌పురి)లోని మూన్‌రాక్ ఎపార్ట్‌మెంట్స్‌లో శ్రీమతి సత్యవతిగారి యింట్లో గురుపూర్ణిమ సందర్భంగా సత్సంగ సమావేశం జరిగింది. శ్రీమతి కన్యక, శారద, మంజుల, ఇందిర, నగరాజ కుమారి, సుచరిత, విజయ, విజయలక్ష్మి అరుణ, రాజ్యలక్ష్మి రత్నకుమారి మొదలైన భక్తులంతా గురుచరిత్ర పారాయణ చేసి ఉన్నారు. వారి కోరికపై మాతాజీ అక్కడికి వెళ్ళి, గురువంటే ఏమిటి - గురుశక్తి ఏమిటి - గురుసేవ అంటే ఏమిటి - గురువు పట్ల ఏకాగ్ర శ్రద్ధ అంటే ఏమిటి - అసలు గురువెందుకు - యిలాటి విషయాలను కళ్యాణ్, ఉపమన్యుల వంటి ప్రసిద్ధ శిష్యుల కథలతో సోదాహరణ ప్రసంగం చేసారు. శ్రద్ధాళువులై విన్న సభ్యులలో ఒకరిద్దరు మంచి ప్రశ్నలు (పరిప్రశ్న) వేసి తమ సందేహాలు తీర్చుకున్నారు కూడా. వారి ప్రేమపూర్వకమైన ఆతిథ్యాన్ని స్వీకరించి ఆశ్రమం చేరుకొన్నారు రాంబాబు అండ్ పార్టీ.

21 ఆదివారం అంతా వాన. అలాగే యిబ్బందిపడుతూనే కళ్యాణి, గుడి, చావడి, ఉష, ప్రత్యూష-అన్నీ శుభ్రం చేసుకోవడాలు, తెల్లవారి ఉత్సవం వంటలకు పాత్రసామగ్రి, సరుకులు సరిచూచుకోవడాలతో సాయంత్రం అయిపోయింది. అంతలో కూరగాయలు వచ్చిపడ్డాయి. వాటిని వేరుచేయటం, బాబావారి తోటలో పెరిగిన పాలకూర

ఏరుకోవటం- బెంగుళూరు నుంచీ వచ్చిన హరికృష్ణ, స్వర్ణ, గోపీకృష్ణ, అనపర్తి అనిల్‌కుమార్, శ్రీనివాస్, నరేశ్ సార్ల సహకారంతో పనులన్నీ చకచక సాగాయి. ఎస్.బాల్‌రెడ్డిగారు పంపిన అద్భుత పుష్పసంపదతో- మా పద్మజ పంపిన అలంకారప్రవీణులు-ముచ్చటైన అలంకరణతో ఆలయానికి సొగసులద్దసాగారు. ప్రశాంతిలోని మామ్మలు, సుశీల అందరూ కలిసి పూలదండలు గుచ్చి గుమ్మాలకు అందించారు. అలాఅలా అర్థరాత్రై, కలత నిద్రతోనే తెల్లవారింది.

బాపట్ల నుంచీ, తెనాలి నుంచీ పదిహేను మంది భక్తులు వచ్చారు తెల్లవారేటప్పటికి. అంతకన్నా ముందే సాయి విద్యాధామం విద్యార్థి కార్య కర్తలు ఊరు తెల్లవారకుండానే వచ్చేసారు. మామిడితోరణాలు కట్ట సాగారు. ఖాజీపేట, అంకిరెడ్డిపల్లె, హాజీపురం, పర్వతాపురం మొదలైన గ్రామాలలో గత వార మంతా శ్రీ సాయిచరిత్ర పారాయణ చేసిన వారంతా వారి వారి గ్రామాల నీటిని శ్రీ సాయి అభిషేకం కోసం అలంకరించిన బిందెలతో తెచ్చారు.

శ్రీ సాయికి మొదట వెన్నతో, తరువాత మామిడి, సపోటా, ద్రాక్ష యాపిల్, బత్తాయి ఫలరసాలతో అభిషేకం చేసారు. అటుపై నారికేళ జలంతో, తదుపరి గోక్షీరంతో, కడపట శుద్ధ జలంతో కన్నుల పండువుగా అభిషేకం జరిగింది నామ సంకీర్తనంతో- శ్రీలక్ష్మణరావుగారి ఆధ్వర్యంలో. ప్రథమ పూజ పూర్తయ్యేటప్పటికి భక్తులు రాసాగారు. ఓ ప్రక్క వానజల్లు పడుతూనే ఉంది సన్నగా. వస్తారా భక్తులు? వచ్చినా ఎందరు వస్తారు?- యీ సమాధానాల్లేని ప్రశ్నలతో వంటశాలలో తర్జనభర్జనలు. అంతలో- రాత్రే శబరిమల యాత్ర నుండీ వచ్చిన శ్రీ నాయర్‌గారు నడుం కట్టుకొని మరీ వచ్చేసారు ఏడింటికల్లా-"ఏం చేద్దామమ్మా!" అంటూ. "హమ్మయ్య!" అనుకొన్నాం. అంతటియాత్ర అలసటనీ ప్రక్కకు నెట్టి పనిలోకి దిగిన ఆ భక్తుని గురుభక్తి మెచ్చదగినదని ప్రశంసించుకొన్నాము. క్రిందటిరాత్రే వచ్చి





ఉన్న ధర్మారెడ్డిగూడెం భక్తులు సుభద్ర, దమయంతి, బుచ్చమ్మ, మా విద్యా ధామం ఉపాధ్యాయినులు జ్యోతి, నాగమణి, కల్పన వగైరాలంతా వారికి సహకారంగా రంగంలోకి దిగారు.

సాయిధామం ప్రాంగణంలో దాదాపు పది లక్షల ఖర్చుతో నిర్మించుకొన్న 'ఓవర్‌హెడ్ టేంక్'కు ప్రారంభోత్సవం, నామకరణం చేయటం కోసం గురుదేవులు, తదితరులైన పెద్దలు, ఇంజనీర్ రవీంద్రరావుగారు అంతా అక్కడికి చేరుకున్నారు. కొబ్బరికాయ కొట్టి, గంగోదకం, మానససరోవర జలాలతో టేంక్‌కు ప్రారంభోత్సవం జరిపారు. 'అమృత' (జలభాండం) అని నామకరణం చేసారు. అటుపై అంతా తిరిగి గుడిలోకి వెళ్లారు. పదిన్నర ప్రాంతాలలో సామూహికంగా సాయికి సహస్ర నామార్చన ప్రారంభమైంది. జాజులు, మల్లెలు, గులాబీలు, చేమంతులు వన్నెవన్నెలుగా స్వామి వారి మీది నుండి జాలువారుతుండగా (పూలదోసిళ్లు ప్రతి నామానికీ చి॥ సాయి నందన్, రాంబాబులు సమర్పిస్తోంటే) కన్నుల పండువైంది. పంక్తులు తీరి కూర్చున్న భక్తులు కూడా సహస్ర నామార్చన చేసారు. దాదాపు గంటసేపు చక్కగా సాగిన యీ పూజ హారతితో ముగిసింది.

మామూలుగా అయితే సాయిపూజ పూర్తి కాగానే గురుపూజ చేసేవాళ్లం. కానీ, గురుదేవులు మౌనదీక్షలో ఉండటం, కొద్దిగా నీరసంగా ఉండటంతో యీసారి పూజ, గురుదేవుల ప్రవచనం కూడా జరగలేదు. మాతాజీ గురుపూర్ణిమ వైశిష్ట్యాన్నీ, గురుభక్తి, గురుసేవ చేయవలసిన రీతి గురించీ, శిష్యునికి ఉండవలసిన లక్ష్యశుద్ధి గూర్చీ వివరించారు. అటుపైన మహాహారతి-దాని తరువాత భక్తులంతా గురుదేవులకు నమస్కారం చేసుకొని ఆశీస్సులందుకొన్నారు. బయట వాన యింకా పడుతూనే ఉంది. అయినా జనం ఓర్పుగా ఉండి సాయిప్రసాదం స్వీకరించి మరీ వెళ్లారు.

రాష్ట్రంలో అనేక దేవాలయాలు తిరిగి చూచిన అనుభవంతో-

మిగిలిన ఆలయాలలో కంటే ద్వారవతిలో భక్తులు సంస్కారంతో, శ్రద్ధతో ఉండటం గమనార్హంగా భావించాము. తీవ్రవ్యాధితో మృత్యుముఖంలోకి వెడుతూ వెడుతూ వెనక్కు వచ్చిన శ్రీమతి కవిత 'గురుపూర్ణిమనాడు-గురుదర్శనం చేసుకోకపోతే ఎలాగ!' అని ఇద్దరు పట్టుకొని నడిపిస్తేగాని నడవలేని దశలో మలక్‌పేట నుంచీ రావటం ఈసారి విశేషం. అంతటి వానలోనూ ఎనిమిది వందల మంది భోజనాలు చేసి వెళ్లటం, యీ కార్యక్రమానికి హేమంతరెడ్డి (రామలింగంపల్లె), సురేశ్‌రెడ్డి (ఆస్ట్రేలియా) సహకరించటం, మా నాయర్‌గారు గరిట తిప్పటం కూడా ఆనందకరం. కీసర నివాసి, సాయి విద్యాధామం పాత విద్యార్థి చి॥ ప్రవీణ్ తన క్రొత్త మైక్‌సెట్స్‌ను (డి.జె. సెట్స్) తెచ్చి గుడిలో ఏర్పాటు చేయటం మరో ముచ్చట. సాయికృపా ఫొటో స్టూడియో, శ్రీ చక్రిపురం అధినేత శ్రీ రవి యథాప్రకారం తమ మందీమార్బలంతో వచ్చి చక్కని ఫొటోలు తీయటం మరో ఆనందప్రదమైన సంగతి. వీరందరికీ పరమాత్ముడు తన దివ్యాశీస్సులు అందించుగాక-అని సాయివాణి ప్రేమాశీస్సులు అందిస్తోంది.

సాయినాథ క్షేత్రం (మైనేనివారిపాలెం)లోని సర్వతోభద్ర దేవాలయం లోని 'ప్రసన్న సాయి'కి గురుపూర్ణిమనాటి ఉదయం ఫలరసాభిషేకం, క్షీరాభిషేకం, జలాభిషేకం జరిగాయి. వివిధ పుష్పఫలాలతో పూజ చేసారు. ఆ తరువాత గురుదేవుల చిత్రపటం ముందర వారి పాదుకలుంచి అష్టోత్తర శతనామ పూజ చేసారు. గ్రామీణులు ఉత్సాహంతో గురుపూజలో పాల్గొని తరించారని అక్కడి పూజారి శ్రీ పి.సాయిరమణ తెలియజేస్తున్నారు.

సత్తెనపల్లి కోదండరామసాయి సన్నిధానంలోని కోదండరామస్వామి దేవాలయంలో గురుపూర్ణిమనాడు విశేషపూజ జరిగిందనీ, భజన, సత్సంగం నిర్వహించి, ప్రసాద వినిమయం చేసామనీ అక్కడి ఆశ్రమ నిర్వాహకులు శ్రీ కె.రామయ్యగారు తెలియజేసారు.







# శుభాశీరక్షతలు



చి॥ సత్యనారాయణరెడ్డి, ఆయన పినతల్లి శ్రీమతి లలిత డిఫెన్స్‌లో ఉద్యోగులు. సత్యనారాయణ ఆశ్రమంలోని పిల్లలందరికీ లేప్‌టాప్ అన్నయ్య. (ఆయన వచ్చినప్పుడు అది తెచ్చి అందులో రకరకాల విషయాలు చూపిస్తుంటాడు వీళ్లకు. అందుకని అదే పేరు పెట్టేసారు). లలితా, అతనూ కూడా పిల్లలంటే ప్రాణం పెడతారు. ఆశ్రమం పట్ల ఎంతో అభిమానం చూపిస్తారు. అలాంటి చి॥ సత్యనారాయణకు చి॥సౌ॥ అనితతో హొటల్ స్వాగత్ పారడైజ్ ఫంక్షన్ హాల్ (చందా నగర్)లో ఆగస్టు 11వ తేదీ ఉదయం గం.7.59 ని.లకు శాస్త్రోక్తవిధితో కళ్యాణక్రతువు నిర్వహించబడింది. ఈ నవ వధూ వరులు పరస్పరానురాగంతో జీవించి, సత్సంతానవంతులై, వారిని లోక కళ్యాణకారకులుగా తీర్చిదిద్ది ధార్మికులై మాతృభూమి ఋణాన్ని తీర్చుకో గలరని ఆశిస్తూ, వారికి సకల సౌభాగ్యాలూ కలగాలని పరమపూజ్య గురుదేవులు ఆశీర్వదిస్తున్నారు.

సాయిధామ ఆశ్రమానికి అత్యంత ఆప్తులు శ్రీ అరవిందాక్షన్ నాయర్‌గారు, వారి ఇల్లాలు శ్రీమతి తంగమణి. మంచి కార్యదక్షత, నిర్మలాంతఃకరణం, దాతృత్వం ఉన్న భక్తులు నాయర్‌గారు. నిజాయితీ, నిర్విరామకృషి ఉన్న వారికి పరమాత్ముడు నిరంతర సహకారిగా ఉంటాడనడానికి వారి జీవితాలే ఋజువు. భవానీ ఇండస్ట్రీస్ చెర్లపల్లి అధినేత శ్రీ నాయర్ దంపతులు తమ చిన్నకుమార్తె చి॥సౌ॥ శ్రీజా నాయర్, బి.టెక్ వివాహం శ్రీమతి అంబికా, రాజగోపాలుల కుమా రుడు చి॥అరుణ్‌కుమార్, ఎంబి.ఏ.తో-పాలక్కాడ్(కేరళ)లోని శారదా శంకర కళ్యాణమండపంలో-ఆగస్టు 30వ తేదీ ఉదయం ఎని మిదన్నర గంటలకు వైభవంగా నిర్వహించారు. వధూవరులిద్దరూ తమ విద్యను సార్థకం చేసుకొంటూ, ఒక్కటిగా జీవించి, సత్సంతాన వంతులై, తమ పెద్దల అడుగుజాడలలో ధర్మమార్గంలో జీవించి ధన్యులు కావలసిందిగా పరమపూజ్య గురుదేవులు తమ హార్దికాశీస్సులు అందిస్తున్నారు.

బాలవాణి

# ఇదే లోకపు తీరు!

**- మాతాజీ**

అనగనగా ఓ అబ్బాయి. నదీతీరంలో పిచ్చుకగూళ్లు కట్టుకొంటూ ఆడుకొంటున్నాడు. రక్షించండీ రక్షించండీ! అన్న కేకలు విన్పించాయి. అబ్బాయి చుట్టూ చూచాడు. ఒక మొసలి వలలో చిక్కుకొని అరుస్తోంది. పిల్లవాడు జాలిపడ్డాడుగానీ దాన్ని విడిపిస్తే తననేం చేస్తుందోనని భయపడి దూరంగానే ఆగిపోయాడు. మొసలి "బాబూ, నన్ను విడిపించు-నిన్నేమీ చెయ్యను-ఒట్టు" అన్నది జాలిగా. అబ్బాయి ఒడ్డున ఉన్న ఒక రాతి ముక్క తెచ్చి దాని సాయంతో వల ఒక మూల తెగిపోయేలా చేసాడు. క్రమంగా తాళ్లులాగి మొసలి తల పట్టేంత రంధ్రం చేసాడు. వెంటనే మొసలి వాడి కాలు నోట కరుచుకొన్నది. అబ్బాయి బెంబేలెత్తిపోయి, కన్నీళ్లతో "ఇది అన్యాయం! నీకు నేను మేలు చేస్తే నువ్వు నాకు కీడు చేస్తావా! ఎంత ద్రోహం!" అని అరిచాడు.

మొసలి పెద్ద వేదాంతిలాగా నవ్వి, "ఏం చేస్తాం బాబూ! ప్రపంచపు రీతే యింత!" అన్నది. అబ్బాయికి ఏడుపు ముంచుకువచ్చింది. చెట్టు మీది పక్షులను చూచి, "చూచారా, ఎంత అధర్మమో! ఇంత అధర్మంతో యీ లోకం ఎలా నడుస్తుంది? మాటకు విలువే యివ్వక్కర్లేదా?' అని అడిగాడు. అవి ముక్కులు విరిచి, "ఏం చెప్తాం బాబూ! మేము చచ్చీ చెడీ, పుల్లా పుడకా ఏరి తెచ్చుకొని గూళ్లు కట్టుకొంటాం. తీరా గూళ్లలో గుడ్లు పెట్టాక పాములు వచ్చి అవి కాస్తా తినిపోతాయి. లోకమంతా యిలాగే కొట్టుకు పోతోంది" అన్నాయి.

దారినబోయే ఒక ముసలి గాడిదను చూచి అబ్బాయి అరిచాడు- "తాతా, నువ్వు పెద్దవాడివి గదా! నువ్వైనా చెప్పు-నన్నలా పట్టుకోవటం తప్పు కాదూ!" గాడిద కాస్సేపు నిశ్శబ్దంగా ఉండి, "బాబూ, నేను చిన్నప్పటి నుండీ నా యజమానికి ఎంతో సేవ చేసాను. ఎంతెంత బరువులు వేసినా కిమ్మనకుండా మోసాను. నా శక్తి అంతా ఆయనకే ధారపోసాను. తీరా,





నాకు వయస్సుపైబడి, ఓపిక తగ్గిపోయేసరికి-"దీనికి తిండి దండగ, ఇదింక పనికిరాదు" అంటూ నన్ను బయటకు తోలేసాడు. ప్రపంచంలో ధర్మం ఎక్కడుంది బాబూ! మొసలి అన్నది నిజమే" అన్నది. అబ్బాయి కాలు మెల్లగా మొసలి పళ్ల మధ్య యిరుక్కుపోతోంది. వాడు భయంతో, బాధతో అల్లాడుతూ అటుగాపోయే ఒక కుందేలును పిలిచాడు. "చూడు కుందేలన్నా! ఈ మొసలి' లోకమంతా అధర్మంతోనే నడుస్తోంది. నేనూ అంతే' అంటోంది. అన్యాయం కాదూ!-మంచి చేసినవాడి పట్ల కాస్తైనా విశ్వాసం ఉండవద్దా!" అన్నాడు.

కుందేలు మహాచురుకైంది. అది 'అబ్బే! నేను ఒప్పుకోను ఈ సిద్ధాంతం. లోకంలో మంచి కూడా బోలెడంత ఉంది" అన్నది. ఆ మాటలకు మొసలికి ఒళ్లు మండిపోయింది. పిల్లవాడి కాలు వదలకుండానే ఏదో జవాబు చెప్పింది. కుందేలు చెవులు రెండూ విదిలించుకొంటూ, "నోట్లో ఏదో పెట్టుకొని నీవు మాట్లాడితే నాకేమి అర్థమవుతుంది? సరిగ్గా చెప్పు తల్లీ!" అన్నది. మొసలి "అబ్బ! ఎంత తెలివి! నేను వదలగానే వీడు పారిపోడూ!" అంది. కుందేలు ఫక్కున నవ్వింది. "ఏం మొసలి మామా, నీ తోక ఎంత బలమైందో, దాని దెబ్బ ఎంత తిరుగులేనిదో మర్చిపోయావా, ఏం! వీడు పారిపోయే ప్రయత్నం చేస్తే నీ తోకతో ఒక్కటి పీకితే సరి-అక్కడికక్కడే పడిపోతాడు" అన్నది యింకా నవ్వుతూనే.

కుందేలు విసిరిన యీ మాటల వలలో పడిపోయింది మొసలి. అబ్బాయి కాలు వదిలి, నోరంతా తెరిచి తన వాదం వినిపించసాగింది. కుందేలు 'పారిపో బాబూ, పారిపో!" అని గట్టిగా అనగానే అబ్బాయి చెంగున గెంతి పరుగెత్తిపోయాడు. బోలెడంత కోపంతో కుందేలువైపు చూస్తూ తోకతో పిల్లవాడిని కొట్టాలని ప్రయత్నించింది మొసలి. కానీ దాని తోక యింకా వలలోనే ఉందిగా! అంచేత కదిలించలేకపోయింది. "ఓసి దొంగమొహమా! నన్ను మోసం చేస్తావా?" అంది. కుందేలు చాలా అందంగా నవ్వేసి "ప్రపంచపు తీరే అంత మామా! ఏం చేస్తాం-ధర్మానికి చోటేదీ!" అని గంతులువేస్తూ వెళ్లిపోయింది.